క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు



కంకిపాడు: దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. వచ్చే నెల మూడవ తేదీ నుంచి దేవీ నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కంకిపాడు, ఈడుపుగల్లు, ప్రొద్దుటూరు, ఉప్పలూరు శివాలయాలు, కంకిపాడు ఆర్యవైశ్య ప్రార్థన మందిరం, మంతెన ప్రధాన సెంటర్‌లో దేవీ నవరాత్రులు వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా కంకిపాడు శివాలయం వద్ద క్యూలను సిద్ధం చేశారు. విశేష పూజా కార్యక్రమాలు జరిపించేందుకు ఉత్సవ కమిటీ, దేవదాయ శాఖ సన్నాహాలు పూర్తి చేసింది.

ఆర్టీసీ పరిరక్షణకు పాటుపడాలి



కంకిపాడు: ఆర్టీసీ పరిరక్షణకు పాటుపడాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా, మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. ఆర్టీసీ నూతన చైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావును ఆయన నివాసంలో ఆదివారం కలుసుకుని సత్కరించారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి విద్యుత్ సదుపాయం



కంకిపాడు: నిరుపేదరాలి కుటుంబానికి ఎట్టకేలకు విద్యుత్ సదుపాయం సమకూరింది. 20 ఏళ్లు గా చీకటిలో ఉంటున్న ఆ కుటుంబంలోకి వెలుగులు వచ్చాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గొడవర్రు గ్రామానికి చెందిన జంగం సరసమ్మ పేదరాలు. తన కూతురు, మనవడుతో పూరింటిలో ఉంటోంది. 20 ఏళ్లుగా ఆ ఇంటికి విద్యుత్ సదుపాయం లేదు. గ్రామానికి చెందిన మాచర్ల రవి చొరవ తీసుకుని గ్రామంలో పుట్టి, కాకినాడలో స్థిరపడ్డ యలమంచిలి ఉమామహేశ్వరరావు దృష్టికి సమస్య తీసుకెళ్లారు. ఆయన ఆర్థిక వితరణతో విద్యుత్ మీటరు ఏర్పాటుచేశారు. సమస్య పరిష్కారం కావడంతో ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తుంది.

ఆహారం వృథా చేయరాదు



ఉయ్యూరు: ఆహారం వృథా చేయకుండా ఆకలితో అలమటించే పేదల కడుపునింపాలని మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు అన్నారు. లయన్స్‌జోన్‌-1 ఆధ్వర్యంలో ఆహార వృధా అవగాహన దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆహార పదార్థాలు వృథా చేయొద్దంటూ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార వృథాపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా నిత్యం ఆహారం వృథా అవుతోందన్నారు. ప్రతిఒక్కరూ ఆహార పదార్థాలను వృథా చేయకుండా సద్వినియోగం చేయాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ జోనల్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, ప్రతినిధులు నెల్లి రాంబాబు, దీనవహి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారి





ప్రసాదంపాడు శ్రీశక్తి కల్యాణ మండపం పక్క రోడ్డు నుంచి కానూరు వెళ్లే రహదారిపై ఏర్పడిన గోతులు

- పెద్ద పెద్ద గోతులతో ఇబ్బందులు
- నిత్యం సర్కస్ ఫీట్లు చేస్తున్న ప్రయాణికులు
- రహదారిని అభివృద్ధి పరచాలని డిమాండ్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు శ్రీశక్తి కల్యాణ మండపం పక్క రోడ్డు నుంచి కానూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారిలో అడుగు అడుగునా గోతులు ఏర్పడటంతో రాకపోకలు సాగించడానికి నిత్యం ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు నిత్యం ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. కానూరు ఆటోనగర్‌కు దగ్గరి మార్గం కావడం, పలు గోడౌన్లు, కంపెనీలు, కళాశాలలు ఉండటంతో ఉద్యోగులు, విద్యార్థుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ రహదారి మాత్రం ఎళ్ల తరపడి అభివృద్ధికి నోచుకోవడం లేదు.

వర్షాకాలంలో నరకయాతన

గోతులమయంగా మారిన ఈ రహదారితో పడుతున్న ఇబ్బందులు ఒక ఎత్తు అయితే వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణమంటే హడలెత్తిపోతున్నారు. చిన్నపాటి వర్షానికే ఈ రహదారి మొత్తం వర్షపునీటితో నిండిపోతుంది. దీంతో గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహన చక్రాలు దిగబడి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. శ్రీశక్తి కల్యాణ మండపం మొదలుకుని ఈ రహదారి చివరి వరకూ ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు నిత్యం సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనధికార పార్కింగ్ సమస్య

అధ్వానంగా మారిన ఈ రహదారికి తోడు ఈ మార్గంలో అనధికార పార్కింగ్ సమస్య ప్రయాణికులను పట్టి పీడిస్తోంది. ఈ మార్గంలో ఎక్కువగా గోడౌన్లు, కంపెనీలు ఉండటంతో నిత్యం ఇక్కడకు వచ్చే లారీలు, భారీ వాహనాలను ఈ రహదారి పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రహదారి సగభాగం ఈ వాహనాల పార్కింగ్‌తో కుంచించుకుపోతుంది. పైగా ఈ మార్గంలో చోటు చేసుకున్న ఆక్రమణల ఫలితంగా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. పలు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఈ రహదారిని అభివృద్ధి పరచాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



అంబాపురం ఒకటవ వార్డులో వ్యర్థాలు

అంబాపురం(విజయవాడరూరల్):అంబాపురం గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. అంబాపురం ఒకటవ వార్డులో 14 అడ్డరోడ్లు ఉన్నాయి. ఈ అడ్డరోడ్లల్లో ఏ వీధికెళ్లినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల వచ్చిన వరదలకు ఒకటవ వార్డులో 15 రోజులపాటు ఇళ్లు ముంపులోనే ఉండగా వాటిలోని గృహోపకరణాలు, పరుపులు, డబుల్‌కాట్ మంచాలు, ప్లేవుడ్ డోర్లు, టీవీలు, ఇతర వస్తువులను రోడ్లపై పడేస్తున్నారు. అయితే వాటిని గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తకుప్పలను తొలగించాలని దుర్వాసన రాకుండా బ్లీచింగ్, సున్నం చల్లించాలని స్థానికులు కోరుతున్నారు. అంటువ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు గ్రామాల్లో వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉండగా మొక్కుబడిగానే జరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

పింఛన్ సొమ్ము విడుదల

పెనమలూరు: మండల పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్ సొమ్ము విడుదల చేసిందని ఎంపీడీవో సునీతాశర్మ తెలిపారు. ఆదివారం ఆమె వివరాలు తెలుపుతూ పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలో మొత్తం పింఛన్ లబ్ధిదారులు 18,451 మంది ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వం రూ. 7,81,41,000 విడుదల చేసిందన్నారు. పెనమలూరు మండలంలో 5,766 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ. 2,41,31,500, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో 12,685 మందికి రూ. 5,40,09,500 సొమ్ము విడుదల చేసిందని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ పంపిణీ చేస్తారని తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పెనమలూరు: యనమలకుదురులో కోతముక్క ఆడుతున్న ఐదుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని మార్కండేయ నగర్‌లో కోతముక్క ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతంలో దాడులు చేశారు. ఎస్‌ఐ షేక్ ఫిరోజ్‌షా నేతృత్వంలో సిబ్బంది దాడులు నిర్వహించి కోతముక్క ఆడుతున్న ఐదుగురుని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 5,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అవగాహనతో గుండె పదిలం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్‌భూపాల్

పెనమలూరు: అవగాహనతో గుండె పదిలంగా ఉంటుందని సీనియర్ ఇంటర్వెన్షల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వల్లభనేని శ్రీరామ్‌భూపాల్ అన్నారు. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం వాకర్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో క్యాపిటల్ హాస్పిటల్ సహకారంతో గుండె ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి, ఒత్తిడి కారణంగా యువతలోనూ గుండె సంబంధ సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. క్రమబద్ధమైన ఆహారం, వ్యాయామంతో గుండెను పదిలంగా ఉంచుకోవచ్చని తెలిపారు. మత్తు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ రూప్‌కుమార్, సెక్రటరీ సతీష్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతోనే గుండె వ్యాధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మారిన జీవనశైలి, ఆహార అలవాట్లతో గుండె సంబంధిత సమస్యలు ఎక్కువవుతున్నాయని ప్రముఖ కార్డియాలజిస్ట్ వీరమాచినేని స్వరాజ్యం అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం అన్వి సూపర్ స్పెషాలిటీ క్లినిక్, ప్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక విజయవాడరోడ్డులోని ప్రవంతి ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కార్డియాలజిస్ట్ స్వరాజ్యం, ప్రముఖ అంకాలజిస్ట్ పాలవరపు కల్యాణ చక్రవర్తి, డాక్టర్ తెర్లి సురేష్ రోగులకు వైద్య సేవలు అందించారు. గుండె సంబంధిత వ్యాధుల పట్ల డాక్టర్ స్వరాజ్యం అవగాహన కల్పించారు. నిత్యం క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయడం వల్ల ఒత్తిడిని జయించవచ్చని, గుండె సంబంధిత వ్యాధులు దరిచేరకుండా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

శ్రీసత్యసాయి పర్తియాత్ర విజయవంతం చేయాలి



శిక్షణ పొందుతున్న చిన్నారులు

పెనమలూరు: శ్రీసత్యసాయి పర్తియాత్రను విజయవంతం చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. పెనమలూరు శ్రీ సత్యసాయి సేవా సమితిలో ఆదివారం పర్తియాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. డిసెంబరులో 14, 15, 16 తేదీల్లో పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో యాత్ర సాగుతుందని, కృష్ణాజిల్లా పర్తియాత్రను దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసిన విద్యార్థులకు వేదం, భజనలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి పర్తియాత్రకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్తలు డి.మోహన్‌రావు, వి. లక్ష్మీప్రసూన, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్తలు ఎ.మురళీకృష్ణ, డి.సాయిజ్యోతి, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో జీవించాలి



నియామక పత్రం అందజేస్తున్న ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): హిందూ, ముస్లింలు సోదరభావంతో ఐకమత్యంగా జీవించాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పేర్కొన్నారు. ఆదివారం విజయవాడ 63వ డివిజన్‌లో సెంట్రల్ యూత్ అధ్యక్షుడు అన్వర్ బేగ్ ఆధ్వర్యంలో ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. అనంతరం వాంబే కాలనీకి చెందిన షేక్ సలాంను ఆజాద్ ముస్లిం కమిటీ 60వ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా నియమించి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజీద్ అలీ, సెంట్రల్ అధ్యక్షుడు అన్వర్ బేగ్, సహాయ కార్యదర్శి సిలార్ బేగ్, 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఉయ్యూరు: అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆసరాగా నిలిచింది. విజయవాడలోని ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కొడాలి ఆంజనేయులు, తిరుపతమ్మ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని మానవత సంస్థ ప్రతినిధులు కలిసి రూ. ఆరు వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో చేవూరి రవి సుధాకర్, మహంకాళి పవన్, ఫణీకుమార్, కొలసాని రవికుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పెయింటింగ్ పోటీలు



బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విజేతలతో డాక్టర్లు వీణ, రామ్‌ప్రసాద్ తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని డెకాథ్లాన్ స్పోర్ట్స్ స్టోర్‌లో ఆదివారం రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యాన పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. చిన్నతనంలో వచ్చే పలు రకాల క్యాన్సర్‌పై అవగాహన నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ పెయింటింగ్ పోటీల్లో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు సుమారు 160 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ పీడియాట్రిక్ హేమాటో ఆంకాలజిస్ట్ డాక్టర్ అక్కినేని వీణ మాట్లాడుతూ పిల్లల ప్రాణాలు కాపాడటంలో తొలిదశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం కీలకమన్నారు. లుకేమియా, లింఫోమా, బ్రెయిన్ క్యాన్సర్, బోన్ క్యాన్సర్ వంటి వాటికి అధునాతన చికిత్స పద్ధతులు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. రెయిన్‌బో హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సలో వచ్చిన పురోగతితో వ్యాధితో బాధపడుతున్న పిల్లలు జీవించే అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయన్నారు. అనంతరం పెయింటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ యూనిట్ హెడ్ గుణశేఖర్ చౌదరి, డెకాథ్లాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దు



కండ్రికలో కళాజాత బృందం ప్రదర్శన

పాయకాపురం(విజయవాడరూరల్): ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దని కళాజాత బృందం సూచించింది. స్వచ్ఛతాహీ సేవలో భాగంగా ఆదివారం విజయవాడ 64వ డివిజన్ కండ్రికలో వీఎంసీ కళాజాత బృందం ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ద్వారా వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు క్లాత్ సంచి, కర్రల సంచి వాడాలని సూచనలు చేశారు. ప్లాస్టిక్ కవర్‌కు మట్టిలో కలిసే గుణం లేదని తెలిపారు. అనంతరం స్థానికులతో కలిసి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపీరాజు ప్లాస్టిక్‌ను తరిమికొడదామని ప్రతిజ్ఞ చేయించారు.

కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: మేకల విజయసారథి మెమోరియల్ రెండో జాతీయ కరాటే పోటీల బ్రోచర్‌ను విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ వడోక్కై కరాటే డో అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా శాస్త్రవేత్త మేకల లక్ష్మీప్రసాద్ విచ్చేశారు. విశాఖపట్నంలో డిసెంబర్ 15 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కోలా ప్రతాప్, జి.ఆనందబాబు తెలిపారు. పోటీలకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ సతీష్ వ్యవరిస్తారని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల క్రీడాకారులు పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు.

చిక్కవరం రహదారికి గండి

పట్టించుకోని అధికారులు



చిక్కవరం కొండమోరు రహదారిపై ఏర్పడ్డ గండి



రహదారి గండి పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణి

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం శివారు చింతగుంట సమీపంలోని కొండమోరుకు వెళ్లే మార్గంలో రహదారికి గండి పడింది. ఇటీవల కాలంలో కురిసిన అధిక వర్షాలకు ఎగువ ప్రాంతంలోని బ్రహ్మయ్యలింగం చెరువు నుంచి వచ్చే నీరు చిక్కవరం గ్రామం పోలవరం వంతెన వద్ద రహదారి దిగువన తూముల ద్వారా పోలవరం కాలువలోనికి చేరుతుంది. అయితే వర్షాలకు పోలవరంలోకి నీరు వెళ్లే మార్గం కొట్టుకుపోతూ వస్తోంది. క్రమంగా రహదారి కింద తూముల ప్రాంతం మెతకగా ఉండటంతో రోజు కొట్టుకుపోతూ శనివారం మొత్తంగా గండి ఏర్పడింది. దీంతో కొండమోరు ప్రాంతంలో సాగుచేసే రైతాంగానికి తీవ్ర ఇక్కట్లు నెలకొన్నాయి. ఈ గ్రామం నుంచి కొండమోరు రోడ్డు వెంట వరి మాగాణాలు, మామిడితోటలను రైతాంగం సాగు చేస్తున్నారు. ప్రసిద్ధ ఉషా పద్మినీ సమేత సూర్య నారాయణస్వామి దేవాలయం ఇక్కడే ఉంది. అయితే ఈ పోలవరం కాలువ మట్టి బ్యాంకు కొట్టుకుపోయి వెనుకకు రహదారి వరకూ గండి పడినా ఇప్పటి వరకూ చర్యలు లేవని గ్రామస్తులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల సమన్వయలోపం

ఈ రహదారికి ఏర్పడ్డ గండిని పూడ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో రైతులు అవస్థలకు గురి అవుతున్నారు. పోలవరం అధికారులు ఎగువ నుంచి వస్తున్న బ్రహ్మయ్యలింగం చెరువు నీటి వల్ల రహదారికి గండి పడిందని దానిని మేము బాగుచేయలేమని చెబుతున్నారు. మండల పరిషత్ అధికారులు ఆ రహదారి తమది కాదని అంటున్నారు. మొత్తంగా ఈ రోడ్డు తమది కాదంటే తమది కాదని ప్రభుత్వ శాఖలు చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులు, గ్రామస్తులు వాపోతున్నారు.

రహదారి గండి పరిశీలన

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం కొండమోరు వద్ద గండి పడిన రహదారి ప్రదేశాన్ని ఆదివారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పరిశీలించారు. రైతులకు ఎంతో ఉపయోగపడే ఈ రహదారి గండిని వెంటనే అధికారులు పూడ్చాలని కోరారు. గత కొన్ని రోజులుగా ఈ రహదారి గండి పడుతుందని ప్రభుత్వ శాఖలకు తెలియజేసినా చర్యలు లేవని విమర్శించారు. రైతుల ప్రయోజనాల పట్ల అధికారులకు శ్రద్ధ ఉండాలన్నారు. వందలాది ఎకరాల పంట భూముల్లోకి రైతులు వెళ్లాలంటే ఇదొక్కటే రోడ్డు మార్గంగా ఉందని, వెంటనే అధికారులు చర్యలు తీసుకుని గండిని పూడ్చించాలని కోరారు. కొత్తగూడెం సర్పంచ్ తూంపాటి రాంబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేడు ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ప్రారంభం



నూతనంగా నిర్మించిన ట్రాఫిక్ పోలీసుస్టేషన్ భవనం

పెనమలూరు: పెనమలూరు కేంద్రంగా తాడిగడప జంక్షన్‌లో ఇటీవల ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నిర్మించారు. ఈ పోలీసుస్టేషన్‌ను జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభించనున్నారు. కాగా మండల పరిధిలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ లేదు. దీంతో పెనమలూరు పోలీసుస్టేషన్‌లోనే తాత్కాలికంగా ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నడుస్తోంది. అయితే మండలంలో విపరీతమైన ట్రాఫిక్, ప్రమాదాలు అధికంగా ఉండటంతో ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను అందుబాటులోకి తెచ్చారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఉంగుటూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో మధ్యాహ్నం మూడు గంటలకు ఎంపీపీ వడ్లమూడి సరోజిని అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

ముస్తాబాద కోలాట సమాజానికి ప్రథమ బహుమతి



ప్రథమ బహుమతిని సాధించిన కోలాటం సమాజంతో గురువు చెన్నకేశవులు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద శ్రీ దాసాంజనేయ కోలాట సమాజానికి ప్రథమ బహుమతి లభించింది. దసరా సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో విజయవాడలో జరిగిన కోలాటం పోటీల్లో తెంపల్లికి చెందిన కోలాటం గురువు చిట్టూరి దుర్గా చెన్నకేశవులు ఆధ్వర్యాన ఈనెల 28న విజయవాడ పీవీ సిద్ధార్థ కళాశాలలో జరిగిన పోటీల్లో సమాజం ప్రథమ బహుమతి సాధించింది. గురువు దుర్గా చెన్నకేశవులను, ఆయన తండ్రి చిట్టూరి గోపీని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కోలాటం కళను ప్రజల్లోకి విస్తృతంగా వ్యాప్తి చెందేందుకు వారు చేస్తున్న కృషిని ప్రశంసించారు.